

# చావులకొండ

ఆక్కడ ఎండ తీవ్రంగా వున్న వేళలో కూడా చాల్లగానే వుంటుంది. ఆ తరుణం అలాంటిదే. దూరంగా హోరెత్తకుండా నేరెత్తకుండా పూర్ణగర్భిణిలా నిదానంగా ఓ చిన్న నది ప్రవహిస్తూ వుంటుంది. ఇటూ అటూ కొండలున్నా కొండల చుట్టూ పచ్చని విశాలమైన చెట్లు. సాదారణంగా మనిషి జాడ, జంతువు జాడా కనిపించవక్కడ. పక్షులు మాత్రం తిరుగుతూ వుంటాయి; పిట్టలు సుఖంగా ఎగురుతూ వుంటాయి. పెద్దగా గాలివీచినప్పుడో, పక్షులు అరిచినప్పుడో తప్ప, ఇతర శబ్దం అంటూ వినిపించదు. అలాంటి చోట ఆ గుబురు చెట్ల మధ్య ఎత్తయిన ఓ కొండ వుంది. ఆ కొండ ఎక్కడానికి చాలా వీలుగా, మెట్లున్నట్టుగా కనిపిస్తుంది. అలా సులభంగా పైకి ఎక్కి ఎక్కి, నిలబడి అటు పక్కగా కిందికి చూస్తే అఖాతంలా కనిపిస్తుంది. కిందవున్న బండరాళ్లన్నీ పెద్దసైజు గోలీకాయలు అలా అలా పడేసినట్టుగా కనిపిస్తాయి. ఇంకా జాగర్తగా చూస్తే పిచికలు కంటే చిన్నవైన పిట్టలు కనిపిస్తాయి. కాని అవి చిన్న పిట్టలుకావు. పెద్ద పెద్ద రాబందులు. కొన్ని పైకి ఎగురుతూ, కొన్ని గంతులు వేస్తూ, కొన్ని పోట్లాడుకుంటూ కనిపిస్తాయి. పైన, చుట్టూ అంత ప్రశాంత వాతావరణం- కింద మాత్రం భయంకర వాతావరణం.

అలాంటి వాతావరణంలో- మనుషులు రావడానికి భయపడే ఆ స్థలంలో ఇద్దరు మనుషులు కనిపిస్తున్నారు. ఇద్దరూ కొండమీద, బండరాళ్ల మీద జేరబడి కూచుని వున్నారు. వాళ్ల పక్కన లాటీకర్రలూ టోపీలూ వున్నాయి. కాకీ బట్టలు వేసుకుని, బీడీలు పీలుస్తూ కబుర్లు చెప్పుకుంటున్న ఆ ఇద్దరూ పోలీసులు.. ఏ దొంగా ఏదోరా తిరగని అలాంటిచోట, ఆ కొండమీద పోలీసులెందుకు కూచున్నారు?-

# రావికొండలరావు కథ



ఎందుకంటే- ఆ కొండ ఆత్మహత్యలు చేసుకోడానికి అనువైన కొండ. దాన్ని 'చావులకొండ' అంటారు. ఆ కొండ మీదనుంచి దూకగలిగే ధైర్యం వుంటేచాలు- ఏ కోశానా బతికే అవకాశం లేదు! కొండ ఎక్కడం సులువు; చావడం సులువు. ఎక్కుతూ వుంటే చూడ్డానికి ఎవరూ వుండరు గనుక, ఆగమని ఆపేవాళ్లు వుండరు. ఇన్ని కారణాల వల్ల అది 'ఆత్మహత్యలకొండ' గానూ, 'చావులకొండ' గానూ పేరు పొందింది. పరీక్షా ఫలితాలు తెలిసే రోజుల్లోనూ, పెళ్లిళ్లకాలంలోనూ, కరువుకాటకాలు వచ్చినప్పుడూ- అలా ఒక్కో సీజన్లో ఆత్మహత్యలకి అక్కడ గిరాకీ ఎక్కువగా వుంటుంది. మామూలు రోజుల్లో అయితే ఒకటీ అరా జరిగినా, ఈ మధ్య ఎందుకనో- సీజన్ కాకపోయినా వారానికి ఇద్దరూ ముగ్గురూ అక్కడ ప్రాణాలు తీసుకుంటున్నారని, ప్రభుత్వం అక్కడ డ్యూటీలమీద పోలీసువాళ్లని ఏర్పాటు చేసింది. ఆ పోలీసులు బండరాళ్ల వెనక కనిపించకుండా కూచుని, ఆత్మహత్య చేసుకోడానికి వచ్చేవాళ్లను ఛట్టున పట్టుకుని నివారించి, అరెస్ట్ చేసి, కేసు రాసి స్టేషన్‌కి తీసుకెళ్లి కూచోబెడతారు. ఆ సంకల్పంతోనే ఆ ఇద్దరు పోలీసులూ అక్కడ డ్యూటీ చేస్తున్నారు.

అరగంట పాటు ఇద్దరూ మౌనంగా వున్నాక, "బోరుకొడుతోందెహె" అన్నాడు చిన్న మీసంగల పోలీసు బీడీ పారేసి.

"తప్పదు" అని పెద్ద మీసంవాడు బీడీ దమ్ములాగి ఒళ్లు విరుచుకుంటూ లేచి-

"ఇవాళ నాలుగోరోజు, మరి బోరెత్తదా" అన్నాడు.

"అయితేనేం- ఇదే బావుందన్నా. పొద్దున్న వస్తున్నాం. ఇంత చల్లగాలి పీలుస్తూ హాయిగా కూచుంటున్నాం. తెచ్చుకున్నదేదో తింటున్నాం; సాయంకాలానికి వెళ్లిపోతున్నాం." అన్నాడు చిన్న మీసం పోలీసు బండకి మరింత జేరబడి.

"నువ్వు చెప్పింది నిజమే. 'మినిస్టర్లు వస్తున్నారని అక్కడ కాపలాకి వెళ్లు- దొంగలు ఎక్కువగా పడుతున్నారు గనక రాత్రిళ్లు ఆ చోట కాపలాలు కాయి- ఎక్కడో దొమ్మి జరుగుతోంది గనక అక్కడికి పరుగెత్తు-

అక్కడేదో మర్డర్ జరిగింది, వెళ్లి వాళ్లని పట్టుకో'-అని చెప్పకుండా, ఈ కొండమీద వేసిన డ్యూటీ బాగానే వుందిలే"

"ఐనా, మినిస్టర్లకి కాపలాలు కాయమంటే నాకు సెద్ద బయం అన్నా" అన్నాడు చిన్నవాడు.

"ఏం నిన్ను చూడగానే ట్రాన్స్‌ఫర్ చేస్తారనా, పెమోషను ఇవ్వరనా?"

"అదేంకాదులే. మినిస్టర్లకి పెద్దోళ్లకి కాపలాలంటే ఎందుకు- ఆళ్లనెవడూ కొట్టకుండా, కాల్చకుండా గదా. నాకొడుకులు ఆళ్లని కొట్టబోయారనుకో, అయ్యి మనకి తగుల్తాయిగదా- అదీ బయం"

"అదా! ఏం చేస్తాంలే! ఎవడికి ఎప్పుడు ఎలా రాసి పెట్టుందో అలా జరగాల్సిందే గద. ఇంకోటుందిరోవ్- పెద్దోళ్లకి కాపలాలు కాస్తూ మనం చచ్చిపోయాం అనుకో, ప్రభుత్వం బాగా చూస్తుంది. కుటుంబానికి మంచి డబ్బు. మనకి పేరూను. అయితే అలాంటిది అంత సులభంగా జరగదులే." అన్నాడు పెద్ద మీసం పోలీసు, మూతలేని పాతరకం ఫ్లాస్కులో చల్లగా అయిపోయిన టీని కొంత గొంతులో పోసుకుంటూ.

"ఏదీ, ఎలాగుంది టీ?"

"తాగుతావా! నీళ్లు ఇంతకన్నా వేడిగా వుంటాయి" అని డొక్కు ఫ్లాస్కుని అందించాడు పెద్దమీసం. చిన్నమీసం పోలీసు టీని గొంతులో పోసేసుకుని గడగడా మింగాడు. ఆ మింగుడు శబ్దం తప్ప ఇంకే శబ్దమూ లేదక్కడ. చిన్నవాడు లేచి నిలబడి బెల్టు సర్దుకున్నాడు అటూ ఇటూ చూస్తూ.

"దిక్కుమాలిన చోటు. మూడో మనిషి మొహం కనిపించదుగదా" అన్నాడు టోపీ తలమీద పెట్టుకుని.

"టోపీ ఎందుకురా- కిందకెళ్తావా?"

"లేచి నిలబడగానే, టోపీ పెట్టుకోటం అలవాటయిపోయింది గురూ... అందుకని" అని నవ్వాడు తనే.

పెద్దపోలీసుకూడా మౌనంగా నవ్వి-

"ఈ సంవత్సరం హెడ్డవుతానట" అన్నాడు పైకి చూస్తూ.

"సూపరెంటన్నాడా?"

"లేదు. జ్యోతిష్కుడు ఎవడేనా చెప్పాలి"

"చెప్పినా ఆళ్ల మాటలు నమ్మకన్నా. నాకూ అలాగే చెప్పారు. ఆరునెలల్లో అయిశ్వరియం వొస్తుందని చెప్పి, రెండేళ్లయింది. అయిసర్యియంవొద్దు ఏంవొద్దు గాని, ఆకల్లేకుండా వుంటే చాలు!" అన్నాడు చిన్నవాడు బండరాయి మీద కూచోబోయి, చుర్రుమనగానే లేచి- "దీందుంపా... కాకీ గుడ్డకూడా పల్చబడి పోతోంది. ఏంరోజులో చూడు! ఈమాత్రంవేడి కూడావోర్చడంలేదు" అన్నాడు.

"అన్నట్టు అన్నా- అడగాలనుకుంటూ మరిచిపోతున్నాను- కోటిలింగాల గూడెంలోని కానిస్టేబులు ఎంకటేశర్లు కేసు ఏమయిందీ?" అని అడిగాడు చిన్నవాడు పెద్దవాడి పక్కనే వెచ్చి కూచుంటూ.

"ఇంకా ఏంలేదుగానీ, ఆడు నేరం చేసినట్టు మాత్రం తేలిపోయింది"

"టేశన్లో ఉన్నదాన్ని ఆడు రేప్ చెయ్యలేదనీ, అదే అలాకేసెట్టిందనీ అన్నారు..."

"అన్నారు! సూపరెంటు ఆరా

తీశాడు. ఆ పిల్లని తనికీ చేసి డాక్టర్లు ఒప్పుకున్నారుగదా"

"దొంగ సర్టిఫికెట్లన్నారు..

"ఏం కాదురా, అలాగే అన్నారు అందరూ. ఆడే చేశాడు- చేసినట్టు ఒప్పుకున్నాడు గదా.. పోయే కాల కాకపోతే, ఏం బుద్ధి చెప్పు ఆడిది! అలాంటోళ్లనుంచే డిపాటుమెంటు అంతటికీ చెడ్డపేరు!"

పెద్దమీసం పోలీసు వొళ్ళు విరుచుకుంటూ లేచి, పైన చూస్తూ నిలబడ్డాడు.

"ఏవుందన్నా పైన? ఇందాకట్నుంచి అలా చూస్తున్నావు?"

"పెమోషను"

ఆమాటకి చిన్నవాడూ పైకి చూసి, "నాకేం కనిపించడంలేదే" అన్నాడు.

"అదే- అంతా శూన్యమేనని చెప్పడం! ఏంటో ఎపుడో! ఈ ఉద్యోగంలోకి రాకుండా, ఇంకో దానికెళ్లినా బాగుండే వాణ్ణి. చూశావురా- నా పెద్ద కొడుకు ఒంసువులు- ఆడికీ పోలీసుద్యోగమే కావాలిట. ఈ కష్టాలు అర్థం చేసుకోడు!"

"ఎక్కడి కష్టాలు అక్కడే వుంటాయిలే అన్నా. 'ఈరోజుల్లో పోలీసు ద్దోగాలే బాగున్నాయి' అన్నవోళ్లు లేరా!... మామరదలు మొగుడికి సెంట్రల్లో మంచి ఉద్దేగం. ఆడు అది బాగోలేదంటాడు!"

అలా మట్లడుకుంటూ పెద్ద, చిన్న పోలీసులిద్దరూ బీడీలు వెలిగించారు. ఎండ ధీవరాగా వెలిగిపోతూనే వుంది. కొండమీదనుంచి చూస్తే దూరంగా వెళ్తున్న బస్సు, పిలల్ల ఆడకునే కారు సైజులో- జారిపోతొంది. పోలీసులిద్దరు ఎవరి ఆలోచనల్లో వాళ్లుండి, అట ఇటూ తిరుగుతూ వుంటే, ఎవరో వస్తున్న అలికిడయి, ఛట్టున బండల వెనక నక్కారు.

"ఎవడో మనిషొస్తున్నాడ్రో" అన్నాడు పెద్ద పోలీసు నెమ్మదిగా.

"రానీ రానీ"

వాళ్లు అనుకున్నట్టే రొప్పుతూ ఆయాసపడుతూ ఒక మనిషొచ్చాడు అక్కడికి. పోలీసులు నక్కివున్న బండకే నీరసంగా జేరబడ్డాడు. కాస్సేపటికి లేచి, నిటారుగా నిలబడి, ఆకాశం వంక చూసి, రండు చేతులూ పైకెత్తి నమస్కరించాడు. ఆ విన్యాసాన్ని ఇద్దరు పోలీసులూ గమనించారు. ఒకర్నొకరు చూసుకొని లేవబోయారు. వచ్చిన మనిషి అటూ ఇటూ చూసి, వచ్చిన దారినే కిందకి దిగసాగాడు.

"ఎవడో పిచ్చాడు గురూ" అన్నాడు చిన్నమీసం నెమ్మదిగా.

"ఎందుకొచ్చినట్టు- ఎందుకు పోతున్నట్టు?"

"చెప్పానుగదా- పిచ్చోడని! చిరిగిపోయిన బట్టలు, ఆవాలకం అంతా అలాగే వుంది."

పది పదహేను అడుగులు కిందికి దిగిన ఆ మనిషి, ఒక్కసారి వెనక్కి తిరిగి జోరుగా పైకి పరుగెత్తాడు. పరుగెత్తుతూ బండరాళ్ళు దాటబోతూవుంటే, పెద్దపోలీసు "ఆగు" అని కేకపెటి, ఛట్టున వెళ్లి జబ్బ పట్టుకున్నాడు. అతను విడిపించుకోడానికి పెనుగులాడబోతే, రండో పోలీసు కూడా వెళ్లి గట్టిగా పట్టుకున్నాడు.

"ఎవరయ్యా నువ్వు?" అని అడిగాడు పెద్దపోలీసు.

"నేనెవరైతేనేం- నన్ను విడిచి పెట్టండి. నేను మోక్షం వెతుక్కుంటున్నాను. విముక్తి కోసం పరుగెత్తుతున్నాను. విడిచి పెట్టండి" అని అరిచాడు అతను.

"అదేంకుదరదు. అందుకే వున్నాం మేమిక్కడ. మర్యాదగా టేశన్కి నడు. అక్కడే నీకు మోచ్చం" అన్నాడు చిన్న పోలీసు.

"ఇదిగో, నీలాంటి వాళ్లు ఆత్మ హత్యలు చేసుకుంటున్నారనే మేము ఇక్కడ కాపలా కూచున్నాం. ఎవడూ రాలేదనుకుంటూ వుంటే నువ్వొచ్చావు- నిన్నొదులుతామా- పద" అని లాగాడు పెద్ద పోలీసు.

"బాధలు పడలేక, బతకుమీద విరక్తి కలిగి చచ్చిపోదామని నేననుకుంటూ వుంటే, ఇక్కడ కూడా నాకు బాధలేనా? నా చావు నన్ను చావనివ్వండి. నాప్రాణం మీద మీకేం అధికారం లేదు- వదలండి" అన్నాడు పెనుగులాడుతూ ఆ మనిషి.

"ఎవరిదయినా సరే, ప్రాణం తీసుకోడం నేరం. నడు కిందికి"

"సార్! నాప్రాణం నేను తీసుకుంటున్నాను- మీవన్నెల్ని తియ్యమనడంలేదు; మీ ప్రాణం నేను తియ్యడంలేదు ప్లీజ్! నన్నొదలండి"

"మరీ ఎక్కువ వాదించావంటే లాటీలతో నాలుగుకొట్టి, కిందపడేసి లాక్కుపోతాం- జాగర్త" అన్నాడు చిన్నవాడు.

ఆ మనిషి లాభంలేదని, పెనుగాలాడ్డం తగ్గించాడు. నీటి జగ్గులోంచి నీరొచ్చినట్టు, కళ్లమ్మట నీళ్లు జలజలా పొంగాయి.

"ఈ భూమ్మీద ఇంకా నేను బతకాల్సిందేనన్నమాట. నాకింకా ఆయువు మూడలేదు కాబోలు; ఈ చెరసాలనుంచి ఇప్పట్లో విముక్తి లేదు కాబోలు" అన్నాడు అతను నిస్పృహతో.

"నీకీ భూమ్మీద నూకలు చెల్లలేదను" అన్నాడు చిన్నపోలీసు- గట్టిగా చెవిటివాడి దగ్గర అరిచినట్టు. ఆ మనిషి నీరునిండిన ఎర్రని కళ్లతో అతని కేసి చూసి- "నూకలు ఎప్పుడో చెల్లిపోయాయి. ఇన్ని మెతుకులు తిని ఎన్నాళ్లయిందో, నాకుటుంబానికి పెట్టి ఎన్నాళ్లయిందో" అని భోరున ఏడ్చాడు.

ఆ ఏడుపుకి పోలీసుల మనసులు కాస్త కరిగాయి. పట్టుకున్న చేతుల్ని వదిలేసి,"ఏడవకు- ఇలారా. ఇలాకూచో" అని కూచోబెట్టారు రాయిమీద.

"పావం-నువ్వు కష్టాల్లో వున్నట్టున్నావు. ఏంటికత?" అని అడిగాడు చిన్నపోలీసు.

"కథంతా చెప్తాను. విన్నతర్వాత మాత్రం నన్ను ఆపకండి. నేను చేస్తున్నది తప్పనిపిస్తే నన్ను అరెస్టు చెయ్యండి. రైటనిపిస్తే చావనివ్వండి. నేనూ ఎంతో ఆలోచించీ, ఎన్నో ప్రయత్నాలు చేసీ, ఆఖరికి ఇదే పరిష్కారం అని నమ్మి- ఆత్మ హత్యకి పూనుకున్నాను. నిద్ర మాత్రలకి కూడా డబ్బుల్లేవు గనక, ఈ కొండని నమ్ము కున్నాను.

"సరే చెప్పు"

* * *

ఆ మనిషి తన కథంతా చెప్పాడు. అన్నీ కన్నీళ్లే : కష్టాలే. బాగా చదువు కున్న వాడయినా - దుర్భరమైన బతుకు, సంపాదన చాలక పోవడం, సంసారం ఈద లేక పోవడం, అప్పులు చెయ్యడం,

అవి తీర్చలేక పోవడం, ఆబాకీల వాళ్లు కొట్టడం, తిట్టడం - అంతా ఒకేకథ., అలాంటి పరిస్థితిలో అతనింకేమీ చెయ్యలేడు. బ్రతికి వుంటేఅప్పుల వాళ్లు బతకనివ్వరు. వాళ్ల చేతుల్లో చచ్చేకంటే, తనే మైనాడో తెలియకుండా ఇలా చవడమే మేలు !

సవిస్తరంగా చెప్పిన అతని కథంతా విన్నారు పోలీసులు. కొన్ని సంఘటనలు మరీ దారుణం గానూ, కొన్ని హృదయ విదారకంగానూ వున్నాయి! నిజం! అతనికి ఇంకో దారిలేదు ! పోలీసులిద్దరు కొంతసేపు మౌనం వహించారు.

"ఇహ నన్ను చావనిస్తారా" అని లేవబోయాడా మనిషి.

"అదిమాత్రం కుదరదు గురూ! అహ్హా! ... అసలే మేం పోలీసులం - మాదగ్గిరా! పద, నేరం నేరమే" అన్నాడు చిన్నవాడు.

"నేను ముందే చెప్పుకున్నాను. నాకథంతా విన్నాక మాత్రం నను ఆపు చేయొద్దని. ఇప్పుడు నన్ను అరెస్టు చేసి, కోర్టుకి లాగి శిక్ష వేయిస్తే ఏం బావుకుంటారో చెప్పండి నా కుటుంబానికి అదో మచ్చ."

పెద్ద పోలీసు బీడీ వెలిగించి, ఎటో చూస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాడు. చిన్నవాడు మెల్లిగా వెళ్లి - " అనా ! పోనీ, ఈడిని చావనిద్దామా పాపం!" అన్నాడు నెమ్మదిగా.

" ఛీ! మనం ఇక్కడ వుండగా, మన కళ్లెదుట వాడు నేరం చెయ్యడమా! .. కాక పోతే ఒకటి చేదాం. బాగా నచ్చజెప్పి. ఈసారికి వార్నింగ్ ఇచ్చి, ఇంటికి పంపేద్దాం - కేస్ బుక్ చెయ్యొద్దు ".

"ఆడు మళ్లీవస్తాడు "

"వాడి కర్మ. మనం డ్యూటీలో లేక పోయిన తర్వాత వాడిష్టం. మనమేం చేస్తాం"

పోలీసు లిద్దరూ అతని మీద జాలిపడి, బాగా నచ్చజెప్పారు. తాము ఈ పరిస్థితిలో చెయ్యగలిగేదేమీ లేదని, 'వార్నింగ్' తీసుకుని ఇంటికి వెళ్లమనీ. చిన్న పోలీసు సంసారం, జీవితం, పట్టుదల, కృషి, ధైర్యం లాంటి మాటలెన్నో వాడి, అతనికి నచ్చ జెప్పాడు.

" అంచేత, నిన్ను చూసినట్టు మా పెద్దలకి మేం చెప్పం. నీవు కూడా మమ్మల్ని చూసినట్టు చెప్పకు. హాయిగా ఇంటి కెళ్లు. మామాట వినకపోతే మాత్రం అరెస్టు చేసి లాక్కు పోతాం "అని గట్టిగా చెప్పారు ఇద్దరూ కలిసి. ఆ మనిషి ఏం అనుకున్నాడో ఏమో, ఇంకేం చెయ్యలేక, ఇద్దరికీ నమస్కారాలు పెట్టి, శరీరం ఈడ్చు కుంటూ కొండ దిగి పోయాడు.

"అమ్మయ్య. అన్నా! ఇన్ని రోజులూ వూరికే వున్నా ఓ నిండు ప్రాణాన్ని కాపాడాం. అది చాలు. ఆడు మళ్లీ వచ్చుడా - ఈ సారి మన చేతిలో చచ్చాడే "

"పాపం" అన్నాడు పెద్ద పోలీసు ఆ మనిషి దిగుతున్న వేపే జాలిగా చూస్తు.

"డ్యూటీ కింకా రెండు మూడు గంటలున్న ట్టుంది. ఇవాళింక ఎవడూ రాడు. పోదామా అన్నా" అన్నాడు చిన్న వాడు.

"ఇదెలా పోతాంరా ! డూటీ డూటీయే "

"ఐతే పద ! అలా కింది కెల్లి ఏడిగా టీ తాగొద్దాం. బీడీలు కూడా అయి పోయినట్టున్నాయి."

"నేను రాలేన్రా. వచ్చినా మళ్లీ ఎక్కలేను. వీలైతే నువ్వే వెళ్లి పుణ్యం కట్టుకో "అన్నాడు పెద్ద పోలీసు.

"సర్లే. అదీ నిజమే. నేనే ఎల్తాను. నీదగ్గర ఎంతుంది అన్నా - నాదగ్గర రెండు నోటుంది "

"పెద్ద మీసం పోలీసు , వున్న ఐదారు జేబుల్లోనూ చేతులు పెట్టి వెతికాడు - ఏంతగల్లేదు.

"సర్లే. మళ్లీ రేపు ఎలాగూ ఇక్కడికి రావాలిగా. ఆకొట్టోడికి అరువు పెట్టోస్తాలే " అని దొక్కు ఫ్లాస్కు తీసుకుని టోపీ సర్దుకుంటూ కిందికి దిగాడు చిన్న పోలీసు.

* * *

రెండు బీడీ కట్టలూ, ఫ్లాస్కు నిండా టీ పట్టుకుని, ఆయాసంతోనే ఈల పాట పాడుతూ వచ్చాడు చిన్న పోలీసు - "అన్నా" అని పిలుస్తూ. టోపీ, లాటీ అక్కడ కనిపించాయిగాని, అన్న కనిపించలేదు. ఒంటేలు కెళ్లాడేమోనని అటూ ఇటూ చూశాడు కనిపించలేదు. "అన్నా" అని ఇంకాస్త గట్టిగా పిల్చాడు - సమాధానం రాలేదు. చిన్న పోలీసు కంగారు కంగారుగా "అన్నా అన్నా " అని పిలుస్తూ అటూ ఇటూ తిరిగి కిందికి చూడ్డంతో- అఖాతంలో కాకీ బట్టల మనిషి కనిపించాడు! "అన్నా" అని గట్టిగా ఓ కేక పెట్టి, గుండెలు బాదు కుంటూ, పిచ్చి వాడిలా తిరిగాడు. పొరపాటున అన్న పడిపోయాడా .. ఇందాకటి మనిషిగాని మళ్ళీ వచ్చి అన్నని తోసేశాడా ! ... చిన్న పోలీసు దిగ్గున కూలబడ్డంలో చెయ్యి అన్న టోపీ మీద పడి, అది కదిలింది. టోపీ కింద వున్న ఉత్తరం గాలికి రెపరెప లాడింది. వణుకు తున్న చేతులతో, ఆత్రుతగా తీసి చిన్న పోలీసు ఆ ఉత్తరం చదివాడు.

"తమ్ముడూ!

నా సమస్యలు ఎవరికి చెప్పుకోను! ఎన్నాళ్ల నుంచో నేను ఎన్నో బాధలతో సతమత మవుతున్నాను. ఎదిగిన అమ్మాయిలకి పెళ్లిళ్లు చెయ్యలేక, తక్కిన పిల్లలకి చదువులు చెప్పించలేక ఎన్ని అవస్థలు పడుతున్నానో, నీకూ తెలుసు. నేను చేసిన అప్పులు, చేస్తున్న అప్పులూ ఎలాతీర్చాలో ఏం చెయ్యాలో తెలియక, ఉన్న బాధల్ని చెప్పుకోలేక , దిగమింగలేక అవస్థ పడుతున్నాను. ఈ కష్టాల నుంచి ఎలా విముక్తి పొందాలో వాటిని ఎలా పరిష్కరించాలో తెలియక అవస్థ పడుతున్న స్థితిలో ఇందాక వచ్చిన మనిషి నాకళ్లు తెరిపించాడు. అతను చెప్పిన బాధలు కష్టాలే నావీనూ ! ఆ మనిషి నిస్సహాయస్థితి అర్థమైంది. ఆత్మ హత్యకి మించిన పరిష్కారం లేదన్నట్టుగా విడమరచి చెప్పాడు. నాకు పరిష్కారం దొరికింది. ఇంకనేను కనిపించను. నన్ను క్షమించమని అందరితోనూ చెప్పు !" - నీ అన్న.

చిన్న పోలీసు ఆ ఉత్తరం చదివి, మతిపోయిన వాడిలా ఆ మూలకీ ఈ మూలకీ పరుగెత్తి అఖాతంలోకి చూస్తూ "అన్నా" అని గట్టిగా ఓ అరుపు అరిచి కూలబడ్డాడు. కొండలన్నీ "అన్నా" అని దీర్ఘం తీస్తూ ప్రతిధ్వనించాయి!